క్లుప్తంగా

నేడు మన్నెవార్ల సమావేశం

కౌటాల: మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ కొలావార్ మన్నెవార్ల సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మెర్పల్లి సదాశివ్ బుధవారం తెలిపారు. నేడు మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘంలో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరవుతారని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలోని ఆదివాసీ, కొలావార్, మన్నెవార్లు సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా అజయ్ మాదిగ

కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఇప్ప అజయ్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వంజీరి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నిక జరిగినట్లు సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మన ధర్మయ్య తెలిపారు. ఈనెల 5న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎగురపు నగేశ్, సతీశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం



రాకేశ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల రాకేశ్ ఇటీవల నేవీలో ఉద్యోగం సాధించగా బుధవారం యువకుడిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయనిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, సాహెబ్, సుజాత, నగేష్, కళావతి, శ్రీధర్, విజయ్, రమాదేవి, భారతరత్న, సాదియ, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



సీజ్ చేసిన మద్యంతో అధికారులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని పలు కాలనీల్లో మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా బెల్టు షాపుల్లో విక్రయిస్తున్న రూ.10 వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

'సీఎం బ్రేక్‌ఫాస్ట్' ప్రారంభం



ప్రారంభిస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మండలంలోని 13 పాఠశాలల్లో బుధవారం మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వారంలో రోజుకో రకం అల్పాహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతీరోజు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భాస్కర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై సాగర్

వాంకిడి: యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎస్సై సాగర్ సూచించారు. బుధవారం మండలంలోని ఇందాని గ్రామంలో వాంకిడి పోలీస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ యువకులు ఉన్నత గమ్యాలు ఎంచుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఏఎస్సై పోశెట్టి, హెడ్ కానిస్టేబుల్ గణేష్, పోలీస్ సిబ్బంది మహేశ్ పాల్గొన్నారు.

ఘాటెక్కిన 'ఉల్లి'!

- చుక్కలు చూపిస్తున్న ధర
- ప్రస్తుతం కిలోకు రూ.90
- అదే దారిలో కూరగాయల ధరలు
- సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తిప్పలు



రెబ్బెన: ఉల్లిధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం అందరికి అందుబాటులో ఉన్న ధరలు అమాంతం పెరిగి ఆకాశాన్నంటాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డిమాండ్‌కు సరిపడా ఉల్లిగడ్డ మార్కెట్‌లో అందుబాటులో లేకపోవటంతో రోజురోజుకూ ధరలు పెరుగుతున్నాయి. దీంతో పక్క రాష్ట్రం నుంచి దిగుబడి చేసుకొని మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు కొత్త ఉల్లిగడ్డ వచ్చే వరకు పరిస్థితి ఇలాగే ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

రూ. 90 చేరిన ధర

గత నెలలో కిలో రూ. 20 నుంచి రూ. 30 వరకు పలికిన ఉల్లిగడ్డ ధర ప్రస్తుతం రూ. 90కి చేరుకుంది. కొద్ది రోజులుగా ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈసారి వర్షాలు కాస్త ఆలస్యం కావడంతో దాని ప్రభావం ఉల్లిసాగుపై పడింది. ఆలస్యంగా సాగు చేపట్టడంతో ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా నిల్వలు లేకపోవటంతో ధరలు పెరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నిల్వలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. డిసెంబర్‌లో కొత్త ఉల్లిగడ్డ మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది.

పక్క రాష్ట్రం నుంచి దిగుమతి

ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి అందుబాటులో లేకపోవడంతో ఉల్లిగడ్డలను పక్క రాష్ట్రం మహారాష్ట్ర నుంచి వ్యాపారులు తెప్పించుకొని స్థానికంగా విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలో ఉల్లిసాగు అధికంగా ఉండటంతో అక్కడి నుంచి హోల్‌సేల్ ధరకు కొనుగోలు చేసి ఇక్కడి మార్కెట్‌లో రిటైల్‌గా విక్రయిస్తున్నారు. ధర అధికంగా ఉన్న కారణంగా వ్యాపారులు సైతం తక్కువ మొత్తంలో ఉల్లిగడ్డలను తెప్పించి విక్రయిస్తున్నారు. పెరిగిన ధరల కారణంగా సామాన్య ప్రజలు ఉల్లిపాయలు తక్కువ మొత్తంలో కొనుగోలు చేసి పొదుపుగా వినియోగిస్తున్నారు. వారానికి 2కిలోల వరకు ఉల్లిగడ్డలను వినియోగించిన ప్రజలు ప్రస్తుతం ధర పెరుగుదలతో కిలో ఉల్లిగడ్డలతోనే సరిపెట్టుకుంటున్నారు. ఉల్లికి తోడు బెండ, కాకర, చిక్కుడు, వంకాయ వంటి కూరగాయాల ధరలు సైతం చుక్కలు చూపిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

తక్కువగా కొంటున్నాం



ఉల్లిగడ్డల ధరలు భారీగా పెరగడంతో తక్కువగా కొనుగోలు చేస్తున్నాం. నెల క్రితం రూ. 30 వరకు ఉన్న ధర ప్రస్తుతం పెరిగి రూ. 90కి చేరింది. ఇంకా ఎంత పెరుగుతుందో తెలియడం లేదు. రోజంతా కష్టపడి పని చేసిన కూలీ డబ్బులు కూరగాయలకే సరిపోతున్నాయి. – సరోజన, గోలేటి

ధరలు బాగా పెరిగాయి



ఉల్లిగడ్డల ధరలతో పాటు కూరగాయల ధరలు కూడా బాగా పెరిగాయి. మాలాంటి కూలీ పనులు చేసుకునే వాళ్లకు పెరిగిన ధరలు భారంగా మారాయి. సాధారణ రోజుల కంటే చాలా తక్కువగా ఉల్లిగడ్డలు, కూరగాయలు కొనుగోలు చేసి వినియోగిస్తున్నాం. – లక్ష్మి, గోలేటి

మార్కెట్‌లో ఏం కొనేటట్టులేదు



మార్కెట్‌లో కూరగాయలు, ఉల్లిగడ్డలు ధరలు చూస్తుంటే ఏమీ కొనేట్టు లేదు. కూరగాయలను తగ్గించుకొని పప్పులు ఎక్కువగా వండుకుంటున్నాం. సామాన్యులు పెరిగిన ధరలతో బతకడం కష్టంగా మారుతోంది. జనవరి వచ్చే వరకు సర్దుకోవడం తప్పా చేసేదేం లేదు. – శ్రీనివాస్, ఆటో డ్రైవర్

రైతుల పక్షపాతి కాంగ్రెస్



వాంకిడిలో ప్రచారం చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న అజ్మీరా శ్యామ్‌నాయక్

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్యామ్ నాయక్

తిర్యాణి: కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ రైతుల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యామ్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు తప్ప ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలకు అందించిన భూములను నూతనంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 అసెంబ్లీ స్థానాలు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్ గౌడ్, మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, యువజన సంఘం అధ్యక్షుడు పున్నం హరీశ్ కుమార్, నాయకులు సతీశ్, శ్రవణ్, వెంకటేశ్, రాజు, వినోద్, వాసుదేవ్, మధుకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

లింగాపూర్: మండల కేంద్రంలో బుధవారం ఆసిఫాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజ్మీరా శ్యామ్‌నాయక్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జాదవ్ లోకేందర్, చవాన్ సునీల్, రాథోడ్ బలిరాం, రాథోడ్ బాపురావ్, నూనవత్ గోవింద్, అడే బబ్లు, లోద్దిగూడా గంగు తదితరులు ఉన్నారు.

వాంకిడిలో..

ఆసిఫాబాద్: వాంకిడి మండలంలోని సవాతి, ధాబా, దొడ్డిగూడ, డోంగర్‌గావ్ గ్రామాల్లో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసే ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్అలీ, నాయకులు సయ్యత్ తమీం, మహ్మద్ పాషా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్లకు ఏర్పాట్లు

సిర్పూర్(టి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. సిర్పూర్(టి) నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం మండల కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 3 నుంచి 15వ తేదీ వరకు రిటర్నింగ్ కార్యాలయం ఆవరణలో 100 మీటర్ల లోపు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండలంలోని కొఠారి, ధనోరా, సుర్దాపూర్, సాంగ్వి పోలింగ్ బూత్ కేంద్రాలను ఎంపీడీవో మహేందర్ పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులను పరిశీలించారు. పాఠశాలలను పోలింగ్ బూత్ కేంద్రాలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

'ఎమ్మెల్యే కోనప్పను ఆశీర్వదించండి'



కౌటాలలో ప్రచారంలో నాయకులు

కౌటాల: బీఆర్ఎస్ సిర్పూర్ అభ్యర్థి కోనేరు కోనప్పను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్ఎస్ నాయకులు బుధవారం మండలంలోని గుడ్లబోరి, సాండ్‌గాం, కౌటాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి జరిగిందన్నారు. సర్పంచ్ మౌనిశ్, రాందాస్, దామోదర్, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు మధుకర్, తిరుపతి, రవి, అశోక్, బాపు, గట్టయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వ ప్రసాద్‌రావు

రెబ్బెన: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టబోతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మండల కేంద్రానికి చెందిన మహిళలు, యువకులు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దుర్గం సోమయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోషం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీ సర్పంచ్ గంటుమేర, సర్పంచ్‌లు కార్తీక్, శ్రీకాంత్, నాయకులు మురళీ, మల్లారెడ్డి, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్‌గౌడ్, నర్సాగౌడ్, ప్రేందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈజ్‌గాంలో రావి శ్రీనివాస్ ప్రచారం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రావి శ్రీనివాస్ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను అర్హులందరికీ అందిస్తామని పేర్కొన్నారు.

గిరిజన వీరుడికి ఘన నివాళి



భీంకు నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

కెరమెరి: మండలంలోని సాకడ చౌరస్తాలో బుధవారం గిరిజన వీరుడు కుమురం భీం 83వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీలు సాకడ చౌరస్తాకు చేరుకొని కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఎగురవేశారు. ఆదివాసీ సమాజానికి కుమురం భీం చేసిన సేవలను కొనియాడారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావు, సర్పంచ్ సుమిత్రబాయి, ఆదివాసీ నాయకులు దంబిరావు, పెందోర్ జలపతి, శ్రీనివాస్, సాగర్, లచ్చు, బిలాజి, తుకారాం, సోము తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తూ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ అందించాలని కోరారు. సర్పంచ్‌లు శ్రీనివాస్, చంద్రమౌళి, ఎంపీటీసీ రాజన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగరావు, నాయకులు సాజీద్, శ్రీనివాస్, బండు, బాబు, యువకులు పాల్గొన్నారు.

'కోవ లక్ష్మి గెలుపే లక్ష్యంగా పని చేయాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు



రెబ్బెన: ప్రచారంలో టీబీజీకేఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావ్ అధ్యక్షతన పట్టణ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు సమయం ఎక్కువగా లేనందున బూత్‌స్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోను ఓటర్లకు వివరించాలని సూచించారు. కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని, పార్టీకి కార్యకర్తలే కీలకమన్నారు. కోవ లక్ష్మితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎంపీపీ మల్లిఖార్జున్, నాయకులు అలీబిన్ అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న, నాయకులు రాజేశ్వర్, ప్రసాద్‌గౌడ్, ఇర్ఫాన్, సత్తన్న, రమేశ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: గడిచిన పదేళ్లుగా చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి ఓటేయాలని జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని చింతకర్ర, చిన్నుగూడ, శ్యాంరావుగూడ, కెస్లాగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

టీబీజీకేఎస్ నాయకుల ప్రచారం

రెబ్బెన: ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి మద్దతుగా బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లో టీబీజీకేఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. గోలేటిలోని కార్మిక వాడల్లో ఇంటింటికి వెళ్లి కోవ లక్ష్మికి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు, జీఎం కమిటీ సభ్యులు మారిన వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు సాంబగౌడ్, తిరుపతి, సత్యనారాయణ, కైత స్వామి పాల్గొన్నారు.

లింగాపూర్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి అన్నారు. కాంగ్రెస్ ఎన్నో ఏళ్లు పాలించినా నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని, తాము చేసిన అభివృద్ధే నియోజకవర్గంలో ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్ కుమార్, ఎంపీపీ అడే సవితప్రేమ్, వైస్ ఎంపీపీ అడే ఆత్మరాం, రమేశ్ ఉన్నారు.

నజ్రూల్‌నగర్‌లో 'పాల్వాయి' ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామంలో బుధవారం బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కమలం పువ్వుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఖాళీదాసు ముజుందర్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన కొంత మంది యువకులు బుధవారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ నాయకులు కుందారపు సుమన్ ఆధ్వర్యంలో నాయకులు ఆదె శ్యాంరావు, పత్తిదేవయ్య, పసుల గణేశ్‌లతో పాటు పలువురు పార్టీలో చేరారు. నాయకులు తిరుపతి, అశోక్, శ్రీనివాస్, గణపతి, ప్రసాద్, విలాస్, సత్యనారాయణ, రాజయ్య, శ్రీకాంత్, శంకర్, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

'బీఎస్పీతోనే అభివృద్ధి సాధ్యం'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

కౌటాల: బీఎస్పీతోనే బహుజనుల అభివృద్ధి సాధ్యమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం మోతిరాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలువురికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్‌లోని అరాచక పాలనను అంతం చేయడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవకు వచ్చిన ప్రవీణ్‌కుమార్‌కు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగపూరే బండు, నాయకులు దుర్గం వెంకటేశ్, సాయినాథ్, రుషి, ప్రకాశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తడి,పొడి సాగు పద్ధతిలో అధిక దిగుబడి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

కాగజ్‌నగర్‌రూరల్: తడి, పొడి సాగు పద్ధతి ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించి అధిక దిగుబడి పొందవచ్చని కోర్ కార్బన్ ఎక్స్‌సొల్యూషన్స్ కంపెనీ ప్రతినిధి, శాస్త్రవేత్త నరసింహారెడ్డి అన్నారు. రూరల్ అవెర్నెస్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ (రైడ్స్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని దుర్గానగర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భూగర్భ జలాలపై ఒత్తిడిని తగ్గించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. సంస్థ ప్రతినిధులు మనోహర్, దివాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే కార్మిక హక్కులు సాధ్యం



మాట్లాడుతున్న బోగే ఉపేందర్

తిర్యాణి: ఏఐటీయూసీతోనే కార్మికుల హక్కులు సాధ్యమవుతాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదబీమా, రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా కల్పించాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు కిన్నక జంగు, ప్రధాన కార్యదర్శి సత్తయ్య, కోశాధికారి లింగరావు, నాయకులు సింగం మొగిలి గౌడ్, భీంరావు, గట్టయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా బులాయి వేడుకలు



బులాయి ఆడుతున్న యువతులు

రెబ్బెన: మండలంలోని గోలేటి పరిధిలో గల అంబేద్కర్ కాలనీలో మహిళలు, యువతులు బులాయి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దసరా పండుగ పురస్కరించుకొని దసరా నుంచి 9రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో బులాయి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. చివరిరోజు బుధవారం కాలనీ మహిళలు, యువతులు బులాయి వేడుకల అనంతరం గ్రామానికి సమీపంలో ఉన్న వాగు వద్ద బులాయిని నిమజ్జనం చేశారు.